

వైభవంగా గిరిప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం శ్రీశైలంలో ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి గిరి ప్రదక్షిణను వైభవంగా నిర్వహించారు.



ఆయకట్టు 'సాగు' తోంది..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండో పంటకు కూడా సాగు నీరు ఇస్తున్నారు. మొత్తం 3.47 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,623.42
టీఎంసీల సామర్థ్యం	: 105,788
ప్రస్తుతం	: 71,452
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,438

న్యూస్‌రీల్

29 కేంద్రాల్లో గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్ష

కర్నూలు(సెంట్రల్): ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూపు–1 ప్రిలిమినరీ పరీక్షకు 29 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఈనెల 8వ తేదీన ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహించే పరీక్షకు జిల్లాలో 9,651 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సర్వీసు కమిషన్, లైజనింగ్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లతో కలెక్టర్ సమావేశమయ్యారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.రామసుందర్ రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, అడిషినల్ ఎస్పీ నాగబాబు, సర్వీసు కమిషన్ మానిటరింగ్ అధికారి కొండారెడ్డి పాల్గొన్నారు.

డీఐవోగా ప్రవీణ్‌కుమార్



కర్నూలు(హాస్పిటల్): జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్(డీఐవో)గా డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. గతంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఈఎన్‌టీ విభాగంలో వైద్యునిగా, ఆర్‌ఎంవోగా పనిచేశారు. పదోన్నతిపై డీఐవోగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. బదిలీల్లో భాగంగా నెల్లూరుకు వెళ్లారు. అక్కడి నుంచి నంద్యాల జిల్లాకు వచ్చి ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పుడు మళ్లీ కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

'సుంకేసుల'లో 0.7 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో శుక్రవారం సాయంత్రం సమయానికి 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో డ్యాం గేట్లను మూసి దిగువకు నీటి విడుదల నిలిపేశారు. కేసీ కాల్వకు 705 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

జిల్లాలో 97.95 శాతం పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో శుక్రవారం సాయంత్రానికి 97.95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. మొత్తం 2,43,573 మంది లబ్ధిదారులు ఉండగా 2,38,583 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఇంకా 4,990 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 13వ స్థానంలో ఉంది. వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఓర్వకల్లులో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మిగనూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కల్లూరు అర్బన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో నిర్వహించిన వారోత్సవాల్లో మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వాట్సాప్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సమస్యల పరిష్కారానికి జిల్లాకో వాట్సాప్ నంబర్‌ను ఇవ్వనున్నామని, త్వరలోనే ఇవి అందుబాటులోకి వస్తాయని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ కె. శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యల ఫొటోలు తీసి వాట్సాప్ చేస్తే వెంటనే పరిష్కారం లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలోకి బిల్లుల మొత్తాన్ని జమ చేస్తే వారు తిరిగి తమకు చెల్లిస్తారని స్పష్టం చేశారు. దీని వల్ల ఉచిత విద్యుత్‌కు ఏ సమస్య రాదన్నారు. సమావేశంలో ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారిద్దాం

కర్నూలు(రాజ్‌విహార్): గర్భిణుల్లో రక్త హీనత నివారించేందుకు తగిన సూచనలు ఇవ్వాలని జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య అన్నారు. శుక్రవారం స్థానిక బీ.క్యాంప్‌లోని కర్నూలు ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో హెల్తీ కర్నూలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యకరమైన కర్నూలు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లులు ఆరోగ్యంగా ఉండాలని, దీని కోసం గర్భిణుల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలను నివారించాలన్నారు. వారిలో రక్తహీనత నివారించేందుకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. పండ్ల రసాలు తాగడంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, ఐడీసీఎస్ పీడీ కేఎల్ఆర్‌కే కుమారి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

భరోసా కల్పిస్తాం.. స్వేచ్ఛనిస్తాం!

''ప్రతి ఒక్కరూ గుండెపై చేయి వేసుకుని నిద్రపోవడంతో పాటు.. అత్యవసర సమయాల్లో రాత్రిళ్లు మహిళలు ఒంటరిగా బయట తిరిగినప్పుడే పోలీసుల పనితీరుకు ప్రశంసలు. ఆ దిశగా అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు నిరంతరం శ్రమిస్తున్నాం. రికవరీ విషయంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇతర రాష్ట్రాలకు వెళ్లి, ప్రాణాలు ఫణంగా పెట్టి మరీ రికవరీ చేస్తున్న మా సిబ్బందికి అభినందనలు. సీసీఎస్‌ను బలోపేతం చేస్తాం. స్పందనతో ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు నిఘాను పటిష్టం చేస్తున్నాం. 'సేఫ్ సిటీ'తో అనుకున్న లక్ష్యాలను చేరుకుంటాం.'' అంటున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

– సాక్షి ప్రతినిధి కర్నూలు



ప్రమాదం జరిగితే ప్రాణం పోతుంది. కుటుంబం రోడ్డున పడుతుంది. మనం చేసే చిన్న పొరపాటు మరొకరికి శాపం కాకూడదు. తప్పు చేస్తేనే చలానాలు పడతాయి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి, ఆ దిశగా చేస్తున్న ప్రయత్నమే చలానాలు. ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేవు. కేవలం ప్రజల భద్రత దృష్ట్యా తీసుకున్న నిర్ణయమే ఇది.

– సిద్ధార్థ్ కౌశల్, జిల్లా ఎస్పీ

సత్ఫలితాలిస్తున్న 'సేఫ్ కర్నూలు'

- ట్రాఫిక్ చలాన్ల విషయంలో వెనక్కు తగ్గం
- సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- సైబర్ కేసుల ఫిర్యాదుకు 1930 టోల్‌ఫ్రీ
- ఇతర రాష్ట్రాల్లో ప్రాణాలకు తెగించి రికవరీ
- మహిళలు, కుటుంబాలు రాత్రిళ్లు కూడా స్వేచ్ఛగా తిరిగినప్పుడే పోలీసు చర్యలు సఫలం
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

సాక్షి: జిల్లాలో పోలీసుల పనితీరు ఎలా ఉంది? 'సేఫ్ సిటీ' పేరుతో చేస్తున్న డ్రైవ్ ఎలాంటి ఫలితాలు ఇస్తోంది.

ఎస్పీ: పోలీసుల పనితీరు బాగుంది. గణేశ్‌యాత్ర, దేవరగట్టు, డిసెంబర్ 31న ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. హర్యానా గ్యాంగ్ ఏటీఎం దొంగతనం చేస్తుండగానే పట్టుకున్నాం. 'సేఫ్‌సిటీ'తోనే ఇది సాధ్యమైంది. సంతోష్ నగర్‌లో పెట్రోలింగ్ లేదు. 'సేఫ్‌సిటీ'లో భాగంగా పోలీసులు తిరుగుతూ గమనించి పట్టుకున్నారు. 3నెలలు పైలెట్ ప్రాజెక్టుగా చేశాం. గత 31వ తేది నుంచి అధికారికంగా అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో నాలుగో అతిపెద్దసిటీ కర్నూలు. ట్రాఫిక్, రోడ్ సేఫ్టీపై ప్రధానంగా దృష్టి సారించాం. ట్రాఫిక్ పోలీసులను 57 నుంచి 150 మందికి పెంచాం. గతంలో 14 పాయింట్లు ఉండేవి. ఇప్పుడు 30 ట్రాఫిక్ పాయింట్లు చేశాం.

సాక్షి: ట్రాఫిక్ పోలీసుల భారీ చలానాలతో ప్రజలపై భారం పడుతోంది. చలానాల కంటే అవగాహన కల్పిస్తే బాగుంటుందేమో?

ఎస్పీ: రాంగ్‌రూట్, త్రిబుల్‌రైడింగ్ చేయకూడదని అందరికీ తెలుసు. కొన్నేళ్లుగా అవగాహన కల్పిస్తున్నాం. కానీ భయం లేదు. చలానాలు వేస్తారనే భయం ఉంటేనే బాధ్యత వస్తుంది. 2021లో రూ.8.70కోట్లు చలానాలు వేసినా.. రూ.2.50కోట్లు మాత్రమే వసూలు చేశారు. 2022లో రూ.7.70కోట్లు చలానాలు వేస్తే రూ.7కోట్లకుపైగా వసూలైంది. బాధ్యతాయుతంగా డ్రైవ్ చేస్తే అర్ధరూపాయి చలానా కూడా వేయం.



సాక్షి: టెక్నాలజీ పెరిగే కొద్దీ సైబర్ నేరాలు బాగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా నగదు విషయంలో మోసపోతున్నారు. వీటి నియంత్రణకు మీ వ్యూహం?

ఎస్పీ: సైబర్ నేరాలపై స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయొచ్చు. లేదా 1930కి కాల్ చేయొచ్చు. ఇప్పుడు కేంద్ర హోంమంత్రిత్వశాఖ నేరుగా వీటిని పర్యవేక్షిస్తోంది. నగదు ఒక ఖాతా నుంచి మరొక ఖాతాకు బదిలీ అయిన తర్వాత రికవరీ చేయడం కష్టం. అయినప్పటికీ నగదు ఎన్ని ఖాతాలకు బదిలీ అయినా అన్నింటినీ ఫ్రీజ్ చేస్తున్నాం. సైబర్ కేసుల్లో మన రాష్ట్రానికి చెందిన నేరస్తులు ఒక్కరూ లేరు. అంతా రాజస్థాన్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, యూపీకి చెందినవారే. అక్కడికి వెళ్లి రికవరీ చేస్తున్నాం. యూపీలో మన పోలీసులపై వేధింపుల కేసులు పెట్టారు. రాజస్తాన్‌లో ఏకంగా దాడి చేశారు. అన్ని సవాళ్లను అధిగమించి రికవరీ చేస్తున్నాం. బ్యాంకుల పేరుతో ఓటీపీ పంపి అడిగితే ఎవ్వరూ స్పందించవద్దని బ్యాంకు మేనేజర్లతో అవగాహన కల్పిస్తున్నాం.

సాక్షి: కర్నూలు సిటీలో నైట్‌లైఫ్ ఉంటుంది. వ్యాపారాలు ఉంటాయి. ఆస్పత్రులకు వచ్చేవారు, వ్యాపారులు రాత్రి వేళల్లో ఫ్యామిలీతో వెళ్లాలన్నా రెస్టారెంట్లు ఉండవు. సిటీలైఫ్‌కు అనువుగా సమయం పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నారా?

సాక్షి ఇంటర్వ్యూ

ఎస్పీ: కచ్చితంగా. అయితే ఆలోపు సిటీలో భద్రత ఉంటుందనే భరోసా రావాలి. ఆ తర్వాత స్వేచ్ఛగా వదిలేస్తాం. ఇందుకోసం 13 పెట్రోలింగ్ బృందాలు ఉంటే, ఇప్పుడు 34 బృందాలతో రాత్రిళ్లు పర్యవేక్షిస్తున్నాం. గతంలో తనిఖీ పాయింట్లు 100 ఉంటే, ఇప్పుడు 300 ప్రాంతాల్లో చేస్తున్నాం. ఓపెన్ డ్రింక్, ఈవ్ టీజింగ్‌ను కంట్రోల్ చేస్తున్నాం. 3నెలల్లో 2,600మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్లలో కౌన్సెలింగ్ ఇచ్చాం. వాహనాలు, ఫోన్లు సీజ్ చేశాం. రాత్రి వేళల్లో మహిళలు, ఫ్యామిలీలు స్వేచ్ఛగా వెళ్లగలగాలి. అప్పుడే నైట్‌లైఫ్‌కు అనుమతిస్తాం.

సాక్షి: పెండింగ్ కేసుల పరిస్థితి ఏమిటి?

ఎస్పీ: గతేడాది రాష్ట్రంలో అత్యధికంగా కేసులు ఉన్న జిల్లాల్లో కర్నూలు మొదటిస్థానంలో ఉండేది. 14,800 కేసులు ఉండేవి. ఇప్పుడు 2,220మాత్రమే ఉన్నాయి. రాష్ట్రంలో 26వ స్థానంలో ఉన్నాం. బాగా తగ్గిపోయాయి. లోక్‌అదాలత్‌లో కూడా ఎక్కువగా పరిష్కరించాం. దీంతో ప్రజలకు న్యాయం జరగడంతో పాటు పోలీసులపై ఒత్తిడి తగ్గింది. పోలీసులు ప్రాపర్టీ రికవరీ, శాంతిభద్రతలపై దృష్టి సారిస్తున్నారు. గతంలో 20శాతం రికవరీ ఉంటే, ఇప్పుడు 70శాతానికి చేరుకుంది. పోలీసులకు అభినందనలు.



సాక్షి: చేతబడి నెపంతో ఇటీవల జంటహత్యలు జరిగాయి. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్పీ: చేతబడి చేస్తున్నారని చెప్పిన వ్యక్తిని కూడా కేసులో పెట్టాం. ఇలాంటి వ్యక్తులు ఉన్న గ్రామాల జాబితా తెప్పించి గ్రామస్తులతో చర్చిస్తాం. వారి సహకారంతో చర్యలు తీసుకుంటాం.

సాక్షి: స్పందన నిర్వహణ ఎలా ఉంది? సమస్యలు పరిష్కారం అవుతున్నాయా?

ఎస్పీ: పోలీసుల పరిధిలో ఉన్న సమస్యలు వందశాతం పరిష్కరిస్తున్నాం. భూ తగాదాలు, ఆర్థిక సమస్యలు, కుటుంబ తగాదాలు కోర్టు అంశాలు.. ఇలాంటి వాటి పరిష్కారానికి కూడా చొరవ చూపుతున్నాం. సమస్య పరిష్కారం కాకపోతే ఎస్ఐ నుంచి డీజీపీ వరకూ ఫిర్యాదు వెళుతుంది. దీన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుంది. స్పందన సమస్యలకు మంచి పరిష్కారం లభిస్తోంది.

సాక్షి: ఎన్నికలు సమీపిస్తున్నాయి? గ్రామాలపై, నేరస్తులపై నిఘా ఎలా ఉంది?

ఎస్పీ: సమస్యాత్మక గ్రామాల్లో గత అక్టోబర్ నుంచి 60 రోజుల్లో 65 గ్రామాల్లో 583 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల్లో జరిగిన హత్యకేసులను వీటి ఆధారంగానే ఛేదించాం. ఎన్నికల సమయానికి వీలైనన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తాం. కెమెరాల ఏర్పాటుతో నేరం చేస్తే రికార్డు అవుతుందనే భయం ప్రజల్లో ఉంది.

సాక్షి: 2023లో మీ ప్రణాళికలు ఏమిటి?

ఎస్పీ: సీసీఎస్ క్లోజ్ అయింది. స్టేషన్లలోనే క్రైం పార్టీలు ఏర్పాటు చేసి రికవరీపై దృష్టి పెట్టాం. సీఐలు బయటకు వెళితే 5–6రోజులు సర్కిల్ ఇబ్బంది అవుతోంది. సీసీఎస్ ఉంటే సీఐలు సర్కిల్‌లో స్వేచ్ఛగా విధులు నిర్వహించవచ్చు. సీసీఎస్‌ను కచ్చితంగా బలోపేతం చేస్తాం. 2023లో ప్రధాన కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేస్తాం. పల్లెల్లో తగాదాలు, గొడవల జోలికి వెళ్లకుండా పల్లెనిద్రలు చేస్తాం.

మెడికల్ కాలేజీ ఆదోనికి వరం

- నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



పూజ చేసి మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఆదోని ఎమ్మెలే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: వెనుకబడిన ఆదోని ప్రాంతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీని మంజూరు చేయడం ఒక వరం అని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆరేకల్లు గ్రామ సమీపాన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.475 కోట్లు మంజూరు చేసి పనులను కేఎంబీ కంపెనీకి అప్పగించిందన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణంపై అపోహలు సృష్టించి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రతి పక్షపార్టీ నాయకులు ప్రయత్నాలు చేశారన్నారు. వారి ప్రయత్నాలను తిప్పికొడుతూ త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరారు. మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని 30 నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, ఈఈ శివరామిరెడ్డి, కాంట్రాక్టర్ మూర్తిస్వామి, నాయకులు గురునాథ్‌రెడ్డి, ఆరేకల్లు సర్పంచ్ లోహితప్రియ వీరస్వామి, రాముడు పాల్గొన్నారు.

పేదలకు 'న్యాయ సహాయ రక్షణ'



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): ఆర్థికంగా బలహీనమైన అట్టడుగు వర్గాల వారికి ఉచిత న్యాయ సహాయం అందించడమే న్యాయ సహాయ రక్షణ వ్యవస్థ లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ 2వ అంతస్థులో న్యాయ సహాయ రక్షణ వ్యవస్థ నూతన కార్యాలయాన్ని శుక్రవారం అమరావతి నుంచి రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ పి.ప్రవీణ్‌కుమార్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ డిఫెన్స్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా ఎంపికైన న్యాయవాదులు ఇకపై నిందితులకు న్యాయ సేవలను అందిస్తారన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీ నాగశ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది 95 కేసుల్లో ఆర్థిక స్తోమత లేని నిందితులకు ఉచితంగా న్యాయ సహాయం అందించామన్నారు. ఇప్పటి నుంచి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ పూర్తిస్థాయిలో అవసరమైన వారికి న్యాయ సహాయం అందిస్తుందన్నారు. నూతనంగా ఎంపికైన కౌన్సిల్ చీఫ్ ఎస్.మనోహర్, డిప్యూటీ లీగల్ కౌన్సిల్ ఎం.శివరామచంద్రరావు, సహాయ లీగల్ కౌన్సిల్ ఎ.సులోచన, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

కమనీయం.. నీలకంఠేశ్వరుని కళ్యాణం

ఎమ్మిగనూరు: పండితుల వేదమంత్రోచ్ఛరణలు.. పెద్దల ఒప్పందాలు.. వధూవరుల బంధుమిత్రుల సమక్షంలో పార్వతి, పరమేశ్వరుల కళ్యాణం వైభవంగా జరిగింది. శ్రీ నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుభకృత్ నామ సంవత్సరం పుష్యమాస పౌర్ణమి రోజు శుక్రవారం రాత్రి 11.45 గంటలకు స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ అధికారులు స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. దేవదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు సత్యనారాయణస్వామి నేతృత్వంలో స్వామి కళ్యాణోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. వధువు తరపున బండా జీవన్న కుటుంబం, వరుడి తరపున గడిగె శ్రీనివాసబాబులు బంధువులుగా వ్యవహరించి పెళ్లి తంతును పూర్తి చేశారు. అంతకుముందు శుక్రవారం తెల్లవారుజామున 5గంటల నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. ఉదయం 6.15 గంటలకు స్వామివారి పందిరి పూజ నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం పందిరి మొదటి, చివరి మెట్టును వడ్డెర కులస్తులు అల్లారు. సాయంత్రం 5గంటలకు మాచాని కుటుంబ సభ్యుల ఇంటిలో ఉన్న గొడుగును పూర్ణకుంభంతో ఆలయం వద్దకు తెచ్చి పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి మేళతాళాలతో తేరుబజారు చేరుకొని అక్కడ పూజలు నిర్వహించి గొడుగును మహారథంపై ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీ నీలకంఠేశ్వర స్వామి, పార్వతి దేవీల విగ్రహాలను పుష్పాలతో అలంకరించిన రథంపై ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు రంగులు చల్లుకొని సంబరాలను జరుపుకున్నారు. వేడుకల్లో ఆలయ ధర్మకర్త మురళీధర్, జగదీశ్, శివశంకర్, నాగేశప్ప, శ్రీకాంత్, సురేష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటరు జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల తుది ఓటరు జాబితాను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులై ఉండి ఇంకా ఓటరుగా నమోదు కాని వారికి మళ్లీ అవకాశం ఇస్తారని, అయితే త్వరలోనే ఇందుకు సంబంధించి ఉత్తర్వులు వస్తాయన్నారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల తుది ఓటరు జాబితాను అందజేయాలని అధికారులను సూచించారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 61,684 ఉండగా వీరి కోసం 66 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 5,364 మంది ఉండగా 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఎలక్షన్ సెల్ డీటీ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల సేవలపై అవగాహన పెంచాలి

కర్నూలు(అగ్రికల్చర్): రైతుభరోసా కేంద్రాల(ఆర్‌బీకేల) ద్వారా అందుతున్న సేవలపై అన్నదాతలకు అవగాహన పెంచాలని వ్యవసాయాధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

డీఈఓ 'నైట్ విజన్'



నిడ్జూరు గ్రామంలో విద్యార్థితో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

కర్నూలు(న్యూటౌన్): పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ రంగారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో విద్యార్థులు ఇంటి వద్ద ఎలా చదువుతున్నారో తెలుసుకునేందుకు నైట్ విజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రంగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రాత్రి 10 గంటల వరకు, మళ్లీ ఉదయం 5 గంటలకు లేచి చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు సరిగా చదివేటట్లు చూసుకునే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. టీవీలు, సెల్‌ఫోన్లు వాడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలని సూచించారు. నిడ్జూరు గ్రామంలో విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు ఎలా సంసిద్ధం కావాలో పలు సూచనలు తెలియజేశారు.

క్లుప్తంగా

పొలాల్లో రేషన్ బియ్యం డంప్



పొలాల్లో డంప్ చేసిన రేషన్ బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర: బొజ్జనాయునిపేట గ్రామ సమీపంలోని పొలాల్లో కొందరు రేషన్ బియ్యాన్ని డంప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయాన్ని గ్రహించి విజిలెన్సు ఎస్‌ఐ జయన్న, విజిలెన్సు తహసీల్దార్ వెంకట నారాయణ, స్థానిక తహసీల్దార్ నాగరాజు శుక్రవారం దాడులు నిర్వహించారు. మొత్తం 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో వీఆర్వో రంగస్వామి, హెడ్ కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 28 మంది హాజరు

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శుక్రవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌కు 28 మంది సిబ్బంది హాజరయ్యారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎస్పీ నిర్వహించిన గ్రీవెన్స్‌కు హాజరై తమ సమస్యలను చెప్పుకున్నారు. అనారోగ్య సమస్యలతో పాటు రిక్వెస్ట్ బదిలీలు వంటి సమస్యలను విన్నవించుకున్నారు. సిబ్బంది నుంచి వినతులను స్వీకరించి విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు కార్యాలయ అధికారులకు ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

తెర్నేకల్‌లో డెంగీ కేసు నమోదు

ఆలూరు: దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామంలో డెంగీ కేసు నమోదైనట్లు మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా శుక్రవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలోని హైస్కూల్ సమీపంలో ఉన్న ఓ మహిళకు డెంగీ సోకడంతో ఇంటి చుట్టుపక్కల ఉన్న పరిసరాలను శుభ్రం చేసినట్లు చెప్పారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యం

● అమ్మకానికి పెట్టిన తండ్రికే చిన్నారిని అప్పగించిన వైనం

డోన్ రూరల్: రెండు రోజుల క్రితం డోన్ రైల్వే స్టేషన్‌లో బిడ్డను అమ్మకానికి పెట్టిన తండ్రి నుంచి రక్షించినా ప్రయోజనం లేకపోయింది. చివరకు ఓ అంగన్‌వాడీ టీచర్ నిర్వాకంతో ఆ బిడ్డను తండ్రికే అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన రాముడు తన రెండేళ్ల బిడ్డను గురువారం రైల్వే స్టేషన్ వద్ద అమ్ముతున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా చిన్నారిని ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగంకు అప్పగించగా ఆమె ఓ అంగన్‌వాడీ టీచర్ సంరక్షణలో ఉంచారు. కాగా సీడీపీఓ అనుమతి లేకుండా అంగన్‌వాడీ టీచర్ అదే రోజు రాముడికే బిడ్డను అప్పగించినట్లు తెలుస్తోంది.

'స్మార్ట్'గా పట్టేస్తున్నారు

● లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ లింక్‌కు భారీ స్పందన
● నెలకు 1500 పైగా ఫిర్యాదులు
● నేడు మూడో విడత రికవరీ మేళా
● డీపీఓకు చేరుకోవాలని బాధితులకు సమాచారం



రికవరీ అయిన సెల్‌ఫోన్‌లు (ఫైల్)

కర్నూలు: సెల్‌ఫోన్ పోతే ఇక ఆశ వదులుకోవాల్సిందే... దాని ఖరీదు ఎంతైనా మర్చిపోవాల్సిందే... అనే రోజులు పోయాయి. ఇప్పుడు వాటిని ఇట్టే రికవరీ చేసి బాధితులకు ఇస్తున్నారు. జిల్లా పోలీసులు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ప్రత్యేక శ్రద్ధతో సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ ఎస్‌ఐ వేణుగోపాల్‌కు బాధ్యతలు అప్పగించి సత్ఫలితాలు సాధిస్తున్నారు. రెండు విడతల్లో సుమారు రూ.3.75 కోట్లు విలువైన 1,611 సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఇప్పటికే బాధితులకు అందజేశారు. ప్రస్తుతం మూడో విడతగా సుమారు పదిహేను వందల సెల్‌ఫోన్ల రికవరీ లక్ష్యం కాగా దాదాపు పదకొండు వందల సెల్‌ఫోన్లను సేకరించారు. వీటిని శనివారం బాధితులకు అందజేయనున్నారు. ఈ మేరకు ఉదయం 8 గంటల లోపు డీపీఓకు చేరుకోవాలని సమాచారం చేరవేశారు. సెల్‌ఫోన్ల రికవరీకి ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ బాధితులకు న్యాయం చేసేందుకు నాలుగు మాసాల క్రితం లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ వెబ్‌సైట్‌ను రూపొందించారు. దీంతో బాధితులు నేరుగా ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదులు చేస్తున్నారు. గతంలో మాదిరి స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయక్కర్లేదు. వారు ఇచ్చే ఫిర్యాదులను బట్టి సెల్‌ఫోన్ కనిపెట్టేందుకు పోలీసులు రంగంలోకి దిగుతున్నారు.

సిమ్ ఆధారంగా...

సిమ్ ఆధారంగా సెల్ ఫోన్లు ఎక్కడెక్కడ వినియోగిస్తున్నారో తెలుసుకుంటారు. ఇందుకు సైబర్ ల్యాబ్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వాటిలో వాడే సిమ్ ఆధారంగా అడ్రస్ తెలుసుకుని సమీపంలోని మండలాలు నియోజకవర్గాలైతే ఫోన్లు చేసి పొరుగు జిల్లాలకు పోలీసులు వెళ్లి రికవరీ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో గుర్తించిన వాటిని పోలీసులు కాల్ చేసి విషయం చెబుతున్నారు. వాటిని పంపించాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తుండటంతో చోరీ సెల్‌ఫోన్లను కొనుగోలు చేసినవారు కొరియర్ల ద్వారా పంపడం లేదా నేరుగా స్టేషన్‌కు వచ్చి అప్పగించడం చేస్తున్నారు. ఇంత చెప్పినా వినకుండా ఇతర రాష్ట్రాల్లో ఉండి మొరాయిస్తున్న వారి వద్దకు వెళ్లి రికవరీ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు నిరాశ చెందాల్సిన పని లేదని, ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో పోలీసు శాఖ రూపొందించిన లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సర్వీస్‌లో ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు.

ఐఎంఈఐ నెంబరే కీలకం...

సెల్‌ఫోన్లను ఐఎంఈఐ నెంబర్ ద్వారా పసిగట్టగలుగుతున్నారు. వాటిని వినియోగించేవారు వేరే సిమ్ వేసుకున్నా ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా కనిపెట్టి పట్టుకుంటున్నారు. బాధితుల సెల్‌ఫోన్లు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా రికవరీ చేస్తున్నారు. ఇప్పటి వరకు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఉన్నవాటిని కూడా తెప్పించారు. డోన్ పట్టణం చిగురుమానుపేటకు చెందిన వారు పొరుగు రాష్ట్రాల్లో భారీ మొత్తంలో సెల్‌ఫోన్లు చోరీ చేసి ఇక్కడి వారికి తక్కువ ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించి పలు దఫాలుగా రికవరీలో భాగంగా వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో సెల్‌ఫోన్లు రాబట్టారు.

లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ లింక్‌లో..

www.kurnoolpolice.in మొబైల్ తెఫ్ట్ వెబ్‌సైట్ లోకి వెళ్తే ఒక లింక్ వస్తుంది. దానిని ఓపెన్ చేసి ఫిర్యాదు ఫారం నింపాలి. తర్వాత ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు. ఇందుకు ప్రత్యేకంగా ఒక సంఖ్య కూడా కేటాయించారు. ఈ విధానంలో ఫిర్యాదు చేసేందుకు సంబంధిత పత్రాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. పేరు, జిల్లా, పోలీస్ స్టేషన్ పరిధి, మొబైల్‌కు సంబంధించిన ఐఎంఈఐ-1, ఐఎంఈఐ-2 వివరాలతో పాటు ప్రస్తుతం వినియోగిస్తున్న మొబైల్ నెంబర్, ఆల్టర్నేటివ్ (ప్రత్యామ్నాయ) కాంటాక్ట్ నెంబర్ వివరాలు సబ్‌మిట్ చేయాలి.

ఫోన్ బిల్లు ఉంటేనే కొనండి



సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లు తక్కువ ధరకు వస్తున్నాయని ఆశ పడి కొందరు కొంటున్నారు. బిల్లు, కనీసం బాక్సు ఉంటేనే కొనుగోలు చేయాలి. లేదంటే అది అపహరించిన ఫోన్‌గా అర్థం చేసుకోవాలి. పోలీసులు ట్రేస్ చేస్తే ఫోన్‌తో పాటు పరువు పోతుందని గుర్తుంచుకోవాలి.

–కేవీ మహేష్, కర్నూలు డీఎస్పీ

కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశనగ	4,010	7,971
పొద్దుతిరుగుడు	5,469	6,019
ఆముదం	2,349	4,589
వాము	5,519	17,040
ఉల్లి	990	1,685
ఎండు మిర్చి	3,399	34,786
కందులు	2,300	7,400
మినుములు	6,609	7,190
కొర్రలు	2,909	2,909
ఆదోని మార్కెట్ యార్డు ధరలు		
పత్తి	6,086	8,560
వేరుశనగ	4,506	6,679
ఆముదాలు	5,100	6,438
కందులు	5,849	6,880

కాన్పులో తల్లి, శిశువు మృతి



చాంద్‌బీ (ఫైల్)

మంత్రాలయం: ఆ తల్లి కన్న కలలు తీరకుండా తీరని లోకాలకు వెళ్లింది. కనులారా కన్న పేగును చూసుకోకుండానే కన్నుమూసింది. పేగు తెంచుకుని పుట్టిన నవజాత శిశువు (బాబు) సైతం క్షణాల్లోనే ఊపిరి వదిలాడు. ఈ విషాద ఘటన గ్రామస్తులను కలచి వేసింది. మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన పెద్ద దస్తగిరి, భీయమ్మ కూతురు చాంద్‌బీని పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన దస్తగిరికి ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. చదువుపై మక్కువ ఉండటంతో చాంద్‌బీ పత్తికొండ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ కోర్సు రెండో సంవత్సరం చదువుతోంది. తొలి కాన్పు కోసం పుట్టిల్లు రచ్చుమర్రికి వచ్చింది. గురువారం చాంద్‌బీకి నొప్పులు మొదలు కావడంతో ఆదోనికి తీసుకెళ్లారు. అక్కడ సాధారణ కాన్పు జరిగింది. అయితే కాన్పు సమయంలో బ్లడ్ ప్రెజర్ (బీపీ) పెరిగి శిశువుకు పురుడు పోయగానే భయంతో ప్రాణాలు కోల్పోయింది. శిశువు సైతం మూడు నిమిషాల వ్యవధిలోనే ఊపిరి వదిలాడు. మొదటి కాన్పులోనే ఇద్దరు మృత్యువాత పడటంతో ఇంటిల్లిపాది శోక సంద్రంలో మునిగారు.

నేడు, రేపు కేఎంసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 7, 8వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి డాక్టర్ ఎస్. మునీరుద్దీన్ చెప్పారు. శుక్రవారం కళాశాలలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలోని నూతన క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ ఎస్. సంజీవకుమార్, గౌరవ అతిథులుగా పూర్వ విద్యార్థులు డాక్టర్ డి. నాగేశ్వరరెడ్డి, డాక్టర్ బి. సాంబశివారెడ్డి హాజరవుతున్నట్లు వివరించారు. అనంతరం కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ మహేంద్రకుమార్, కోశాధికారి డాక్టర్ బాలమద్దయ్య, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ స్పెషల్ డ్రైవ్

● రెండు పెట్రోల్ బంకులపై కేసు నమోదు



పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

కర్నూలు: పెట్రోల్ బంకుల్లో మోసాలు జరుగుతున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం తనిఖీలకు ఆదేశించింది. కర్నూలు డిప్యూటీ కంట్రోలర్ బి.వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 11 జిల్లాల అధికారులు 8 బృందాలుగా ఏర్పడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పత్తికొండ, ఆదోని, ఆస్పరి, బండి ఆత్మకూరు, వెలుగోడు, నందికొట్కూరు, నంద్యాల టౌన్, పోలూరు టోల్ ప్లాజా నుంచి చాగలమర్రి హైవే వరకు మొత్తం 60 పెట్రోల్ బంకులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 290 దాకా పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఎమ్మిగనూరు పట్టణం కర్నూలు రోడ్డులోని మారుతీ ఫిల్లింగ్ స్టేషన్, పత్తికొండ పట్టణం ఆదోని రోడ్డులోని ముత్యాల శెట్టి అండ్ సన్స్ పెట్రోల్ పంపుల్లో కొలతల పరంగా తేడాలను గుర్తించారు. 5 లీటర్లకు గాను 30 ఎంఎల్ తేడా రావడంతో కేసులు నమోదు చేసి ఒక్కొక్క పెట్రోల్ బంకుపై రూ.75 వేలు అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో తిరుపతి డిప్యూటీ కంట్రోలర్ దయాకర్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్‌తో పాటు అసిస్టెంట్ కంట్రోలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో విజిలెన్స్ తనిఖీలు



ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు, ముఖాధారిత హాజరు, మందుల నిల్వలు, రిజిష్టర్ల నిర్వహణ తదితర అంశాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి తిరుమలేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి, కోడుమూరు సీహెచ్‌సీలు, నంద్యాల జిల్లాలోని గోస్పాడు పీహెచ్‌సీ, వెలుగోడు సీహెచ్‌సీలలో శుక్రవారం తనిఖీలు చేశారు. అధికారులు డీఈ గుణకరరెడ్డి, సీఐ శ్రీధర్, ఎఫ్ఆర్వో అలీఖాన్, ఏఏఓ షణ్ముఖ గణేష్, ఏఈలు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, ఎస్‌ఐలు హనుమంతయ్య, జీవేశ్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు. వెల్దుర్తి సీహెచ్‌సీలో రూ.5.7 కోట్లతో నిర్మాణం పూర్తి కావచ్చిన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. వెల్దుర్తి సీహెచ్‌సీలో ఆరు నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు, కోడుమూరు సీహెచ్‌సీలో సాంకేతిక కారణాలతో ముఖ ఆధారిత హాజరు చేయడం లేదని గుర్తించారు. గోస్పాడు ఆసుపత్రిలో సెప్టెంబర్ వరకే మందుల నిర్వహణ వివరాలు రిజిష్టర్‌లో పొందుపరిచినట్లు, వెలుగోడులో ఫార్మాసిస్టు డ్రగ్ రిజిష్టర్ నిర్వహించలేదని, జననీ సురక్ష యోజన రిజిష్టర్‌లో మెడికల్ ఆఫీసర్ సంతకాలు లేనట్లు గుర్తించారు. ఈ విషయాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపినట్లు విజిలెన్స్ అధికారులు వెల్లడించారు.

9న నరసం రాష్ట్ర సదస్సు



సదస్సు ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర సదస్సు కర్నూలులో నిర్వహిస్తున్నట్లు నరసం అధ్యక్షురాలు కా.వెం.సుబ్బలక్ష్మి తెలిపారు. శుక్రవారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సదస్సుకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి, వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, నరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుబ్బలక్ష్మి, డాక్టర్ దండబోయిన పార్వతీదేవి, రచయిత్రులు హైమావతి, పసుపులేటి నీలిమ, కళాశాల తెలుగు అధ్యాపకురాలు జయసుశీల, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి మాట్లాడుతూ రచయిత్రులు సమాజాన్ని చైతన్య పరిచే రచనలు చేయాలన్నారు. రాష్ట్ర సదస్సును కర్నూలులో నిర్వహించడం అభినందనీయమన్నారు. నరసం అధ్యక్షురాలు కా.వెం.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 9న ఉదయం 9.30 గంటల నుంచి కేవీఆర్ కళాశాలలో నరసం 4వ వార్షికోత్సవంతో పాటు రాష్ట్ర సదస్సు జరుగుతుందన్నారు. సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 100 మంది రచయిత్రులు హాజరవుతారన్నారు. శాసన మండలి పూర్వ ఉప సభాపతి, పూర్వ అధికార భాషా సంఘం డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, దేవదాయ శాఖ పూర్వ కమిషనర్, విశ్రాంత కలెక్టర్ నందివెలుగు ముక్తేశ్వరరావు, గుంటూరుకు చెందిన ప్రసిద్ధ పండితులు కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, నరసం గౌరవాధ్యక్షులు తేళ్ల అరుణ, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కళావతి చినలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పాతూరి అన్నపూర్ణలతో పాటు జిల్లాలోని పలువురు ప్రజా ప్రతినిధులు అతిథులు పాల్గొంటారన్నారు. నరసం జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతీ దేవి మాట్లాడుతూ నరసం రచయిత్రుల కవితా సంపుటి 'నేను సైతం' ఆవిష్కరణ జరుగుతుందన్నారు. 'మహిళలు-సమాజ ప్రగతి దీపికలు' అనే అంశంపై సాహితీ సదస్సు, కవి సమ్మేళనం, సాహితీవేత్తలకు సన్మానం నిర్వహిస్తామన్నారు.

చదువుకోమని మందలించడంతో ఆత్మహత్య



మృతిచెందిన అరవింద్

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): జులాయిగా తిరగకుండా చదువుకోమని తల్లిదండ్రులు మందలించటంతో క్షణికావేశానికిలోనై అరవింద్(18) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొణిదేల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకొంది. ఎస్‌ఐ ఎన్‌వీ రమణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శేషన్న, జయమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. వీరిలో రెండో కుమారుడు అరవింద్ పదో తరగతి వరకు చదువుకొని ఇంటివద్ద ఉంటున్నాడు. ఖాళీగా ఉండకుండా పై చదువులకు వెళ్లి జీవితంలో స్థిరపడాలని తల్లిదండ్రులు తరచుగా మందలిస్తున్నారు. దీంతో మనస్థాపానికి గురైన అరవింద్ ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఉదయాన్నే గమనించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్‌ఐ ఎన్‌వీ రమణ ఘటనాస్థలికి చేరుకొని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆయకట్టు 'సాగు'తోంది..

● రబీలో 3.47 లక్షల ఎకరాలకు సాగు నీరు
● జీడీపీ కింద నాలుగేళ్లుగా రబీ సాగు
● గోరుకల్లు సామర్థ్యం పెంపుతో ఎస్సార్‌బీసీకి జలకళ
● తెలుగుగంగ కింద రెండో పంటకు నీరు



హొళగుంద సమీపంలో వరి నాట్లు వేసేందుకు నారును సిద్ధం చేస్తున్న కూలీలు

కర్నూలు సిటీ: ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం రెండో పంటకు కూడా నీరు ఇస్తోంది. దీంతో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ, కేసీ కెనాల్, ఎస్సార్‌బీసీ, తెలుగుగంగ, హంద్రీ-నీవా ప్రధాన కాల్వలు ఉన్నాయి. టీడీపీ హయాంలో తుంగభద్ర దిగువ కాలువ కింద ఒక పంటకు కూడా నీరు సక్రమంగా అందేది కాదు. రబీలో రైతులు పంట విరామం ప్రకటించేవారు. మూడేళ్లుగా ఈ కాలువ కింద రబీలో రైతులు వరి సాగు చేస్తున్నారు. అదే విధంగా ఎస్సార్‌బీసీ కింద స్థిరీకరించిన ఆయకట్టుకు సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లోనే మాత్రమే నీరు ఇచ్చేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రబీ సీజన్‌లో రెండో సారి ఆయకట్టు సాగవుతోంది. తెలుగుగంగ కింద మొదటిసారి ఈ ఏడాది రబీలో పంటల సాగుకు నీరు ఇస్తుండడం విశేషం. టీడీపీ హయాంలో దామోదరం సంజీవయ్య సాగర్(జీడీపీ)ప్రాజెక్టును కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించేవారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కింద రబీలో పూర్తిస్థాయి ఆయకట్టు సాగవుతోంది. శ్రీశైలం, తుంగభద్ర రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండడంతో కేసీ కెనాల్ పరిధిలోని ఆయకట్టుకు రెండో పంటకు నీరిస్తున్నారు. రబీలో ఎక్కువ శాతం ఆరుతడి పంటలకే నీరు ఇస్తున్నారు. నీటి లభ్యత ఎక్కువగా ఉన్న చోట మాత్రమే వరిని సాగు చేసుకుంటున్నారు.

3.47 లక్షల ఎకరాలకు నీరు

తుంగభద్ర దిగువ కాలువ కింద మొత్తం 1.51 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. రబీలో 47,000 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నారు. జీడీపీ కింద కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోని ఆయకట్టుకు 2019, 2020, 2021 ఖరీఫ్, రబీలోనూ నీరిచ్చారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్‌లోనూ రైతులు పంటలు పండించారు. రబీలో 13 వేల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది గోరుకల్లు రిజర్వాయర్‌లో నీటి నిల్వలలు ఎక్కువగా ఉండడంతో ఎస్సార్‌బీసీ కింద రబీ సీజన్‌లో 94,506 ఎకరాలకు నీరు అందించారు. ఈ ఏడాది సైతం 1,13,500 ఎకరాలకు నీరు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కాల్వ పరిధిలో ఎక్కువ శాతం ఆరుతడి పంటలు సాగు కానున్నాయి. అదే విధంగా తెలుగుగంగ కింద ఈ ఏడాది రబీ సీజన్‌లో 84,400 ఎకరాల ఆయకట్టుకు వారాబందీగా నీరు ఇస్తున్నారు.

సాగునీటికి ఇబ్బందులు లేవు



జిల్లాలో సాగునీటికి ఇబ్బందులు లేవు. రబీలో 3.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేందుకు సాగునీటి సలహా మండలి సమావేశంలో తీర్మానం చేశారు. రైతులు ఆరుతడి పంటలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. శ్రీశైలం ప్రాజెక్టులోని నీటి నిల్వలు తగ్గిపోయేంత వరకు మల్యాల నుంచి కేసీ (90వేల ఎకరాలు)కి నీరిచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఆ తరువాత టీబీ డ్యాంలోని ఇండెంట్ పెట్టి కేసీ వాటా నీటిని తీసుకుంటాం.

– కబీర్ బాషా, జల వనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ